
ప్రజలకు అభివాదం చేస్తున్న బండి సంజయ్‌కుమార్



ప్రాణాలు తీస్తున్న ధాన్యం కుప్పలు

- వరుస సంఘటనల్లో పలువురి మృత్యువాత
- రాత్రివేళ బైక్‌లు వరి కుప్పలకు ఢీకొని ప్రమాదాలు

కరీంనగర్ క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలు రాత్రి వేళ వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. చీకట్లో వచ్చే ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ఉన్న ధాన్యం కుప్పలను ఢీకొని అదుపుతప్పి పడి ప్రాణాలు కోల్పోతున్నారు ఇటువంటి ప్రమాదాలు ఇటీవల వరుసగా చోటు చేసుకోవటంతో ఆందోళన వ్యక్తవుతున్నది. రోడ్డు పక్కన పంట పొలాలను సాగు చేసే రైతులు చాలా కాలం నుంచి పంట దినుసును ఎండ బెట్టేందుకు సమీపంలో కల్లాలు లేనందున రోడ్డుపైన ఒక పక్కగా ఆరబెడుతుంటారు. ఇది పంటలు కోతకు వచ్చిన సమయాల్లో సర్వ సాధారణంగా జరుగుతూనే ఉంటుంది.

ఇటీవల ధాన్యం కుప్పలను ఢీకొని వాహనదారులు ప్రమాదాలబారిన పడిన ఘటనలు వరుసగా జరగడంతోపాటు మరణాలు చోటచేసుకుంటుండటంతో దీనిపై తీవ్ర చర్చ నడుస్తున్నది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల మూడు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరికొన్ని ప్రమాదాల్లో వాహనదారులు గాయాల పాలయినప్పటికీ పోలీసు రికార్డులకు చేరకపోవడంతో వారి వివరాలు తెలియరావటంలేదు.

- వీణవంక మండలం మామిడాలపల్లికి చెందిన కొమ్మిడి మణెమ్మ(47) భర్త సమ్మిరెడ్డితో కలిసి ఈ నెల 10న కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి వెళుతుండగా మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామం వద్ద ధాన్యం కుప్పను బైక్ ఢీకొట్టగా అదుపు తప్పి ఇద్దరు కిందపడిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన మణెమ్మను హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది. సమ్మిరెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

ఇది జరిగిన వారం రోజులకు ఈ నలె 18న మొగ్ధుంపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల రంజిత్ కిరణ్(32) తన స్నేహితుడు సాజిద్‌తో కలిసి తిమ్మాపూర్ మండలం మల్లాపూర్‌కు వెళ్లి తిరిగి అర్ధరాత్రి ఇంటికి వెళుతూ ధాన్యం కుప్పను బైక్ ఢీకొట్టగా రంజిత్ కిరణ్ తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాజిద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావు పేట మండలం మల్లారెడ్డిపేట సమీపంలో రోడ్డుపై ధాన్యం కుప్పను బైక్ ఢీకొట్టడంతో మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన ఖలీల్(45) మృతి చెందగా అతని స్నేహితుడు శేఖర్ గాయాలతో ఆసుపత్రిపాలయ్యాడు.

రైతులకు నోటీసులు జారీ చేస్తున్న పోలీసులు

రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయకుండా కల్లాల వద్దనే ఆరబెట్టుకోవాలని సూచిస్తూ పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నారు. హుజురాబాద్ డివిజన్ పోలీసులు రైతులకు ఈ విధమైన నోటీసులు జారీ చేశారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నలు ప్రమాదాలకు కారణం కావద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల డివిజన్‌లో వరుసగా ఇటువంటి ప్రమాదాలు జరిగి ఇద్దరు మృత్యువాత పడగా మరో ఇద్దరికి గాయాల య్యాయి. చిన్న చిన్న ప్రమాదాలు కూడా పదుల సంఖ్యలో జరిగినట్లు సమాచారం. దీంతో ప్రమాదాల నియం త్రణ చర్యల్లో భాగంగా పోలీసులు రంగంలోకి దిగి రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టకుండా కల్లాల్లోనే ఆరబెట్టుకోవాలంటూ కౌన్సెలింగ్ ఇస్తూ నోటీసులు జారీ చేస్తున్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

కరీంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల కారణంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నాలాలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన పాత ఇళ్లు వర్షాలకు నాని కూలిపోయే అవకాశం ఉన్నందున అక్కడ నివసించే వారిని ఖాళీ చేయించవలసిందిగా సూచించాలన్నారు.

మున్సిపల్ శాఖలోని డీఆర్ఎఫ్ టీం అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఆపదమిత్ర శిక్షణ పొందిన వలంటీర్లను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సైన్యానికి,మోదీకి మద్దతుగా ఏక్తా యాత్ర

- కుహనా లౌకికవాదులకు ఇది ఓ హెచ్చరిక
- హిందూ ఏక్తా యాత్రలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సైన్యానికి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మద్దతుగా హిందూ ఏక్తా యాత్ర నిర్వహిస్తున్నామి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీకి సంఘీభావం తెలిపి భారత సైన్యానికి బాసటగా నిలవండి అంటూ ఆయన పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కరీంనగర్‌లో జరిగిన హిందూ ఏక్తా యాత్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భార్య ముందు భర్తను, పిల్లల ముందు తండ్రిని, తల్లి ముందు కొడుకును ఉగ్రవాదులు పహల్గాంలో దారుణంగా కాల్చి చంపారని, అందుకే పాకిస్తాన్‌పై భారత సైన్యం దాడి చేసి సత్తా చూపిందని అన్నారు. భారత సైన్యానికి సంఘీభావంగా నరేంద్రమోదీకి మద్దతుగా హిందూ ఏక్తా యాత్ర ర్యాలీని కొనసాగిద్దామని ఆయన ప్రజలను కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో మహిళా సైనికులు చూపిన వీరోచిత పోరాటాలను ఆయన అభినందించారు.

హిందు ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న కుహనా లౌకికవాదులకు వార్నింగ్ ఇవ్వడానికే హిందూ ఏక్తా యాత్రను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. మతం పేరు అడిగి బట్టలిప్పి హిందువని తెలిశాకే కాల్చి చంపారు, దానికి నరేంద్ర మోదీ ఏం చేశారో చూశారుకదా.. పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి ఆ ఉగ్రవాదులకు నా అన్నవారు లేకుండా చేశారన్నారు. అమెరికాలో ట్విన్ టవర్స్‌పై ఆల్‌ఖైదా దాడి చేసి ఆరు వేల మందిని చంపితే పదేళ్ల తర్వాతే ఒసామా బిన్‌లాడెన్‌ను పట్టుకుని చంపారని, పహల్గాం ఘటన జరిగిన 15 రోజుల్లోనే ఉగ్రవాదుల అంతుచూసిన ఘనత భారత సైన్యానిదనిన ప్రశంసించారు. పాకిస్థాన్‌పై చేసిన యుద్ధాన్ని చిన్నది అని అంటూ తక్కువ చేసి మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి ఖార్జున్ ఖర్గేను సవాల్ చేస్తున్నా.. పాకిస్తాన్ లోపలకు వెళ్లి తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం చిన్న యుద్ధమా.. ఆ దేశ మిలిటరీ మౌలిక వసతులను ధ్వంసం చేయడం చిన్న యుద్ధమా అని సంజయ్ ప్రశ్నించారు. యుద్ధంలో మన రాఫెల్ విమానాలు ఎన్ని ధ్వంసమయ్యాయో లెక్క చెప్పాలని రాహుల్ గాంధీ మాట్లాడడం సిగ్గుచేటని, మన సైన్యం శౌర్య పరాక్రమాలను పొగడాల్సిందిపోయి తక్కువచేసి చూపుతారా అంటూ ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో యుద్ధం జరిగినప్పుడు పీవోకేను ఎందుకు స్వాధీనం చేసుకోలేదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

మీ ఉత్సాహం.. నాకు బలం

హిందూ ఏక్తా యాత్రకు వర్షం కురుస్తున్న లెక్క చేయకుండా వచ్చిన ప్రజలకు ఆయన సంజయ్ అభినందనలు తెలిపారు. మీ ఉత్సాహాన్ని, ఆవేశాన్ని చూస్తుంటే నాకు నాలో రక్తం ఉరకలేస్తుందని, రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తానని అన్నారు. గతంలో కరీంనగర్‌లో ఏక్తా యాత్రలు నిర్వహిస్తే హిందూ పిచ్చోడని హేళన చేశారని, ఏక్తా యాత్ర రోజే పోటీ యాత్రలు పెట్టి విచ్ఛిన్నం చేయాలని చూశారని అన్నారు. హిందూ ఏక్తా యాత్ర చేస్తుంటే తనకు గుండె పోటు వచ్చిందని, స్పృహ కోల్పోయే ముందు నాకు మళ్లీ ఆయుష్షు ఇవ్వాలని అమ్మవారిని వేడుకున్నానని తెలిపారు. అమ్మవారు తనను కరుణించి మళ్లీ పునర్జన్మ ఇచ్చిందని, ఈ జీవితమంతా కాషాయ జెండా, సనాతన ధర్మం కోసమే పని చేస్తానని సంజయ్ అన్నారు. యాత్రను ప్రారంభిస్తూ హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామిజీ, సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ ప్రసంగించారు. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా హనుమాన్ దీక్షాపరులు, బీజేపీ, దాని అనుబంధ సంఘాల శ్రేణులు, వివిధ ధార్మిక, కుల, వృత్తి సంఘాలకు చెందినవారు, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి నుంచి, ఉమ్మడి జిల్లా పరిధి నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే వేషధారణలు, కళా ప్రదర్శనలతో భక్తి, దేశభక్తి గీతాలను ఆలపిస్తూ ర్యాలీలో పాల్గొన్నవారు ముందుకు సాగారు. గాంధీ రోడ్‌లోని వైశ్య భవన్ నుంచి టవర్‌సర్కిల్, కమాన్ రోడ్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, బస్టాండ్ మీదుగా తిరిగి వైశ్యభవన్ వరకు ర్యాలీ కొనసాగింది.

మిగతా 8వ పేజీలో..


పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న ముస్లింలు


బందోబస్తును పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం


కేరళ కళాకారుల ప్రదర్శన

కరీంనగర్ అడిషనల్ డీసీపీగా వెంకటరమణ

కరీంనగర్ క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అడిషనల్ డీసీపీ(అడ్మిన్)గా ప్రతాపగిరి వెంకటరమణ నియామితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది అడిషనల్ డీసీపీ, అడిషనల్ ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పదోన్నతి పొంది పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ప్రతాపగిరి వెంకటరమణను కరీంనగర్ అడిషనల్ డీసీపీగా నియమించారు. కరీంనగర్ టౌన్ ఏసీపీగా పనిచేసి ఇటీవల అడిషనల్ డీసీపీగా పదోన్నతి పొంది కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ అటాచ్‌గా విధులు నిర్వహిస్తున్న గోపతి నరేందర్‌ను భద్రాద్రి కొత్తగూడెం అదనపు ఎస్పీగా నియమించారు. గతంలో కరీంనగర్ జిల్లాలో పనిచేసి అదనపు ఎస్పీగా పదోన్నతిపొందిన సుందరగిరి శ్రీనివాసరావును డీజీ కార్యాలయానికి బదిలీ చేశారు.

మోదీ హయాంలో రైల్వేల అభివృద్ధి


రైల్వేస్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

- జమ్మికుంట రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్‌లో చేరుస్తాం...
- కరీంనగర్-తిరుపతి రైలు వారానికి నాలుగుసార్లు నడిచేలా చర్యలు తీసుకుంటా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ


ట్రాక్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, నాయకులు

కరీంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో రైల్వేలు అభివృద్ధి చెందాయని, ఇందుకు కరీంనగర్ రైల్వే స్టేషనే నిదర్శమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను సైతం అమృత్ భారత్ పథకంలో చేర్చి ఆధునీకరిస్తామన్నారు. గతంలో బీఆర్ఎస్ సహా కొంతమంది నాయకులు లేఖలు రాసి చేతులు దులు పుకున్నారని, ఇప్పుడు అభివృద్ధి జరుగుతుంటే ఇదంతా మావల్లే జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కరీంనగర్ నుంచి హసన్‌పర్తి వరకు 61 కిలోమీటర్ల నూతన రైల్వే లైన్ నిర్మాణంపై సర్వే పూర్తి చేసి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేశామన్నారు. ఈ లైన్ నిర్మాణానికి 1480 కోట్ల వ్యయం అవుతుందని డీపీఆర్‌లో పేర్కొన్నారని, దీనిపై త్వరలోనే కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వారానికి రెండుసార్లు నడుస్తున్న కరీంనగర్ నుంచి తిరుపతి రైలును వారానికి నాలుగుసార్లు నడిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దేశవ్యాప్తంగా 1,350 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరిస్తున్నామని, వీటిలో 103 రైల్వే స్టేషన్లను ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు 27 కోట్లకు పైగా వెచ్చించి ఆధునీకరణ పనులు పూర్తి చేశామన్నారు. ఎయిర్‌పోర్టును తలపించే విధంగా లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఏసీ వెయిటింగ్ హాళ్లు, నాన్ ఏసీ హాల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, టాయిలెట్లు, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ కౌంటర్లు, సోలార్ పవర్ ప్లాంట్, రోడ్డు అభివృద్ధి, ప్లాట్ ఫారం షెల్టర్ ఏర్పాటు చేశామని వివరించారు.

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైల్వే స్టేషన్లను ఆధునీ కరించడం ఎంతో అవసరమన్నారు. తాను ఎంపీగా ఉన్న సందర్భంలో కరీంనగర్ రైల్వే స్టేషన్ కోసం కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్ నుంచి తిరుపతి రైలును కనీసం వారానికి నాలుగు రోజులు నడపాలని కోరారు. కరీంనగర్ నుంచి చాలా మంది ముంబై, షిర్డీ వెళ్తుంటారని, వారి అవసరాల దృష్ట్యా కరీంనగర్ నుంచి ఆ ప్రాంతాలకు రైలు నడపాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి, అడిషనల్ డివిజన్ రైల్వే మేనేజర్ ఆర్ గోపాలకృష్ణన్, సీపీ గౌస్ ఆలం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ పాల్గొన్నారు.


వేదికపై కేంద్ర మంత్రి బండి, రాష్ట్ర మంత్రి పొన్నం నవ్వులు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేలా చూడాలి

సుభాష్‌నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగేలా ప్రోత్సహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం ఎంఎల్‌హెచ్‌పీ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మొదటి కాన్పు, సాధారణ కాన్పు అయ్యేలా ప్రోత్సహించాలన్నారు. సిజేరియన్ డెలివరీ వల్ల ఉత్పన్నమయ్యే ఆరోగ్య సమస్యలను గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు వివరించాలని సూచించారు. ప్రతి గర్భిణికి గైనకాలజీ డాక్టర్‌తో హెల్త్ చెకప్ చేయించాలన్నారు. 30 సంవత్సరాల పై వారందరికి రక్తపోటు, షుగర్ పరీక్షలు చేయాలని, నిర్ధారణ అయి నవారందరికి ఉచితంగా మందులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్నందున ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. 21 నుంచి 28 వరకు రెండో విడత ఇమ్యూనైజేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నందున పిల్లలందరికి టీకాలు తప్ప కుండా ఇప్పించాలన్నారు. సమావేశంలో డీఐవో డాక్టర్ సాజిద, ఎంసీహెచ్‌పీవో డాక్టర్ సనజ వేరియా, డీఎంవో డాక్టర్ శైలేంద్ర, డెమో రాజగోపాల్, డీపీఎం స్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ



మాలవిరమణ బారికేడ్లలో దీక్షాపరులు



స్వామివారికి నమస్కరిస్తున్న భక్తురాలు



ముడుపుతో భక్తుడు

అంజన్నకు భక్తజన హారతి

- కొండగట్టులో వైభవంగా పెద్ద హనుమాన్ జయంతి
- దర్శించుకున్న లక్షన్నరకు పైగా భక్తులు

మల్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో గురువారం హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు అత్యంత వైభవం గా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజనంతో కొండగట్టు కిక్కిరిసింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం అర్ధరాత్రి వరకు అంజన్న దీక్షాపరుల సంకీర్తనలతో కొండంతా మారుమోగింది. అంజన్న దీక్షాపరులు మాల విరమణ కోసం ఏర్పాటు చేసిన కల్యాణ కట్టలో దీక్షలు విరమించారు. ఘాట్‌రోడ్డు, మెట్లదారి జేఎన్‌టీయూ మార్గంగుండా రామ దండును తలపించేలా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజన సాగరంగా మారింది. దాదా పు లక్షన్నరకు పైగా వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చు కున్నారు. కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ కొండపై పర్య వేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.



ముడుపులు కడుతున్న భక్తులు

● కిక్కిరిసిన దీక్ష విరమణ మండపం

ప్రతియేటా వైశాఖ బహుళ దశమి సందర్భంగా నిర్వహించే పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా అంజన్నసన్నిధిలో ఉదయం 3గంటలకు తిరుమంజనం, ద్రావిడ ప్రబంధ పారాయణములు, విశేషఅభిషేకం, తులసీ అర్చన, శ్రీస్వామివారికి పట్టు వస్త్రాలంకరణ, సహస్ర నాగ వల్లి, అర్చన, హోమం, మహా పూర్ణాహుతితో పాటు ఊయల సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశా లలో త్రైయా హ్నిక, త్రికుండాత్మక యజ్ఞాలను వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయఈవో శ్రీకాంత్‌రావు, ఆలయస్థానా చార్యులు తిరుక్కోవెల కపీందర్, ప్రధానఅర్చకులు రామకృష్ణ, జితేందర్‌ప్రసాద్, రఘు, ఉపప్రధానర్చకులు చిరంజీవస్వామి, మారుతీ ఎండోమెంట్ ఏసీ సుప్రియ, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేలాదిగా తరలి వచ్చిన అంజన్న దీక్షాపరులతో కల్యాణ కట్టలో ఏర్పాటు చేసిన దీక్ష విరమణ మండపం కిక్కిరిసింది.

● విప్, ఎమ్మెల్యేల పూజలు

హనుమాన్ జయంతి సంద ర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్, చొప్పదండి, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయరమణరావు అంజ న్న దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేకపూజల జరిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం యాగశాలలో జరుగు తున్న త్రికుండా త్మక యాగంలో పాల్గొన్నారు.

● మంత్రి పొన్నం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి ట్యాంకర్ మజ్జిగను భక్తులకు పంపిణీ చేశారు. పంపిణీ కార్య క్రమాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. కరీంన గర్‌కు చెందిన భక్తులు వేలాది మందికి వైజంక్షన్ వద్ద ఉచిత అన్నదానం చేశారు.

● వర్షంతో భక్తుల రాకకు అంతరాయం

హనుమాన్ జయంతి రెండో రోజైన బుధవారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న వర్షంతో భక్తుల రాకకు అంతరాయం ఏర్పడి నట్లు అయింది. దేవస్థానం తర ఫున వైజంక్షన్ నుంచి వాహనపూజల వరకు ఏర్పాటు చేసిన పందిళ్లు, షామియానలు గాలికి కూలిపోయాయి. గురువారం ఉదయం, సాయంకాలం కురిసిన వర్షం భక్తులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. కొండపైన అడుగడుగున భక్తులకు అపరి శుభ్రత దర్శనమిచ్చింది. అలాగే ఆలయ పరిస రాల్లోనూ చెత్త కనిపించింది. కోనేరులో దీక్షాపరులు వదిలేసిన దుస్తులను వెంట వెంట తీయక పోవడంతో స్నానాల కోసం భక్తులు అసహనానికి గురి అయ్యారు.



మెట్ల మార్గంలో మోకాళ్లతో వస్తున్న దీక్షాపరుడు



మాల విరమణ చేస్తున్న భక్తులు



కొండపైన కలెక్టర్ సత్యప్రసాద్ ఇతర అధికారులు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఉపాధ్యాయుల వృత్తి నిబద్ధత చాలా గొప్పది

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

కరీంనగర్ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల వృత్తి నిబద్ధత గొప్పదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణలో భాగంగా జిల్లాకేంద్రంలోని అల్ఫోర్స్ ఈ టెక్నోపాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణకేంద్రాన్ని ఎమ్మెల్సీ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తినైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకావడం వారి వృత్తి నిబద్ధతకు నిదర్శనమన్నారు. నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించుటకు ఉపాధ్యాయులు నిరంతరం వారి బోధనను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ కో-ఆర్డినేటర్ కర్రఅశోక్‌రెడ్డి, ఆంజనేయులు, చాడ జయపాల్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, తపస్‌బాధ్యులు కట్టరాజేశ్వర్, ఉదయ్‌రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేశవరావు ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్

పెద్దపల్లిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నంబాల కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు జడ్జిచే న్యాయవిచారణ జరిపించాలని ఆదీవాసి హక్కుల పోరాట సంఘీభావ వేదికసభ్యులు డిమాండ్‌చేశారు. అంబేద్కర్ విగ్రహంవద్ద నిరసన వ్యక్తంచేశారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి మాధన కుమారస్వామి మాట్లాడుతూ రాజ్యాంగంలో జీవించే హక్కు ఉన్నప్పటికీ కేంద్రప్రభుత్వం దండకారణ్యంతో పాటు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కేంద్ర పారామిలిటరీ బలగాలు, డిఆర్‌జి బలగాలు ఎన్‌కౌంటర్‌లతోపాటు అడవుల్లో జీవించే ఆదివాసిలను మావోయిస్టుల పేర ఎన్‌కౌంటర్ చేయడం జీవించేహక్కు కాలరాయడమే నన్నారు. నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధానకార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు27మంది చనిపోవడం ఈఎన్‌కౌంటర్‌లపై పలు అనుమానాలు వ్యక్తఅవుతున్నాయన్నారు. 2024 జనవరి1నుంచి ఇప్పటివరకు 525మందిని ఎన్‌కౌంటర్ లతో హత్యచేయడం హేయమైనచర్య అని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్రకోకన్వీనర్ మార్వాడీ సుదర్శన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకన్వీనర్ ముడి మడుగుల మల్లన్న,పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లాఅధ్యక్షుడు బొంకూరి లక్ష్మణ్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో సైనికక్యాంపులను ఎత్తివేయాలని కోరారు. విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకన్వీనర్ బాలసాని రాజయ్య, పౌర హక్కుల ఉమ్మడి కరీంనగర్‌జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి రవి, పౌరహక్కుల సంఘం సహాయ కార్యదర్శి రెడ్డిరాజుల సంపత్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు నారా వినోద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాఉపాధ్యక్షులు పుల్ల సుచరిత, రైతుసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎరుకల రాజన్న, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లాఅధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు గాండ్ల మల్లేశం, పౌరహక్కుల సంఘం సభ్యులు బండారి రాజలింగు, శ్రీపతి రాజగోపాల్, ప్రజాసంఘాల నాయకులు బండి శంకర్, లింగన్న పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మానకొండూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన సముద్రాల రమేశ్(39) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు సీఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్ 15ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నా ఆరోగ్యం కుదుటపడకలేదు. జీవితంపై విరక్తిచెంది ఈనెల20న తనపొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నం..మృతి

మానకొండూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన గాజుల తరుణ్ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఊటూర్ గ్రామానికి చెందిన తరుణ్‌కు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది ఈనెల 19న తమ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. తరుణ్ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



శోభ (ఫైల్)

బోయినపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన ఎర్ర శోభ(48) ఉదయం స్నానం చేసేందుకు బాత్రూంకు వెళ్లింది. ప్రమాదవశాత్తు బాత్రూమ్ డోర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతుడి భర్త రాజిరెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ మూర్తి రామ్ తెలిపారు. కాగా కుటుంబాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, చైర్మన్ బోయిని ఎల్లేష్, యాదవ్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ శివారులో కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతిచెందాడు. బుధవారం రాత్రి రాఘవపూర్ గ్రామానికి చెందిన ఎనుగుల జగన్(25) లొంకకేసారం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రాఘవపూర్ గ్రామ శివారులో ఎదురుగా పెద్దపల్లి వైపు వస్తున్న కారు ఢీకొట్టడంతో జగన్ అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. మృతుడికి భార్య నిఖిత, రెండున్నర ఏళ్ల కూతురు, మూడునెలల కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ గురునాథ్

సుల్తానాబాద్, మే 22: (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, కుటుంబాలకు సమాజంలో తలవంపులు తేవద్దని సుల్తానాబాద్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గురునాథ్ అన్నారు. గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో గురువారం జరిగిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాదక ద్రవ్యాల అనర్థాల పై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతు విద్యార్థులు పాన్, గుట్కా, మత్తు పదార్థాల అలవాటుకులోనై వారి భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. పిల్లల అలవాట్ల గురించి తల్లిదండ్రులకు తెలుపుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారు చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డ్రగ్స్‌రహిత సమాజాన్ని తయారు చేస్తామంటూ ఉపాధ్యాయులచే ప్రతిజ్ఞ చేయించారు. శ్రీరామచంద్ర మిషన్ స్పీకర్ మారుతి రాజు, ఎక్సైజ్ ఎస్ఐ చిరంజీవి, ఎంఈఓ రాజయ్య, ప్రోగ్రాం అబ్జర్వర్ ప్రద్యుమ్న కుమార్, ఆర్పీలు పాల్గొన్నారు. సుల్తానాబాద్, అంతర్గాం, రామగిరి, జూలపల్లి, ఎలిగేడు, కమాన్‌పూర్, ధర్మారం మండలాలకు చెందిన 160 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితుడిని స్వదేశానికి రప్పించిన కేటీఆర్

- గల్ఫ్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహేష్
- విమానాశ్రయం నుంచి కిమ్స్ ఆసుపత్రికి తరలింపు

తంగళ్లపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): సౌదీఅరేబియాలో రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్న తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికిచెందిన మంద మహేష్‌ను స్వదేశానికి రప్పించి బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు అండగా నిలిచారు. ఉపాధికోసం సౌదీ అరేబియా వెళ్లిన మండేపల్లి గ్రామానికి చెందిన మంద మహేష్ పదిహేను రోజులక్రితం రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తనను స్వదేశానికి రప్పించి చికిత్స చేయించాలని కేటీఆర్‌ను వేడుకుంటూ కన్నీరుపెడుతూ సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అదిచూసిన కేటీఆర్ స్పందించి మండెపల్లిలో కుటుంబాన్ని పరామర్శించి వారంరోజుల్లోగా స్వదేశానికి రప్పించి చికిత్స చేయిస్తానని హామీఇచ్చారు. ఫోన్‌ద్వారా మహేష్‌కు ధైర్యం చెప్పారు. కేటీఆర్‌చొరవతో మహేష్‌కు చికిత్స చేస్తామని అంగీకరిస్తూ సౌదీలోని ప్రభుత్వఆసుపత్రికి హైదరాబాద్‌కు చెందిన కిమ్స్ ఆసుపత్రి యజమాన్యం లేఖ రాసింది. సౌదీలో ఉన్న కేటీఆర్ అభిమానులు ఆసుపత్రి నుంచి మహేష్‌ను డిశ్చార్జ్‌చేసి స్వదేశానికి పంపించారు. గురువారం ఉదయం మహేష్ విమానాశ్రయంలో దిగగానే బీఆర్ఎస్ నాయకులు బండి దేవదాస్, గజభీంకర్ రాజన్న, బుస్స లింగం నేరుగా కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న మహేష్‌ను గల్ఫ్ నుంచి స్వదేశానికి రప్పించి చికిత్స చేయిస్తున్న కేటీఆర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



మహేష్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఎలిగేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదేగ్రామానికి చెందిన వేల్పూరి మాధవరావు(50)కి తీవ్రగాయాలై రెండుకాళ్లు విరిగిపోయాయి. శివపల్లిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణానికి మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న మాధవరావును బలంగా ఢీ కొంది. ద్విచక్ర వాహనాన్ని లాక్కెళ్లడంతో కిందపడిన మాధవరావు రెండుకాళ్లు విరిగినట్లు స్థానికులు తెలిపారు. గమనించిన స్థానికులు హుటాహుటిన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో అతివేగంగా వాహనం నడుపుతు ఈప్రమాదానికి కారకుడయ్యాడని గ్రామస్థులు తెలిపారు.

కోనరావుపేట మండల కేంద్రంలో చోరీ

- డాగ్ స్క్వాడ్‌తో సోదాలు నిర్వహించిన పోలీసులు
- రూ.40వేల కిరాణం సామాను 10 వేల నగదు అపహరణ

కోనరావుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలో ఓ కిరాణం దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.40 వేల కిరాణం సామాను 10 వేల నగదును ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో సోదాలు నిర్వహిస్తున్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు కూతపేటు దూరంలో ఉన్న పుల్కం జలంధర్‌కు చెందిన హోల్‌సేల్ కిరాణం దుకాణంలో డోర్లు పగలగొట్టి లోనికి చొరబడి పదివేల నగదు సుమారు 40వేల విలువగల సామగ్రిని అపహరించారు. మండల కేంద్రంలో డీజే సౌండ్ ఓ పెండ్లి సందడిలో ఉండగా ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు సౌండ్ వినపడకుండా డోర్లు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఇది సీరియస్‌గా తీసుకున్న ఎస్సై ప్రశాంత్‌రెడ్డి వెంటనే రంగంలోకి దిగి సోదాలు నిర్వహిస్తున్నారు.



డాగ్ స్క్వాడ్‌తో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

రెండు లారీలు ఢీ

- డ్రైవర్ మృతి, మరో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని ఇరుకుల్ల వద్ద రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి 8 గంటలకు రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండువాహనాల డ్రైవర్లు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడగా వారిని పోలీసులు, స్థానికులు బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న లారీడ్రైవర్ జిన్నా(25) మృతిచెందాడని కరీంనగర్ రూరల్‌సీఐ ఎ నిరంజన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌నుంచి గోదావరిఖనివైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న మరోలారీని ఢీకొట్టింది. ఇదే సమయంలో ఒకకారును ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో జీవాలు మృత్యువాత

ఎల్లారెడ్డిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్ గ్రామాలోని గెంటె రాములు, పాండవుల నగేశ్‌కు చెందిన ఐదు జీవాలు గురువారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. మండల కేంద్రంలోని గెంటెరాములు గొర్రెలు వర్షానికి డివైడర్ పైకి ఎక్కగా, మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలకు అమర్చిన ఏర్త్‌వైర్‌కు విద్యుత్తు సరఫరా కావడంతో రెండు గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. వెంకటాపూర్‌లోని నగేశ్‌కు చెందిన మూడు మేకలు గ్రామ శివారులోకి మేతకు వెళ్లాయి. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌వద్ద ఉన్న సపోర్టు వైరుకు కరెంటు సరఫరాకావడంతో చనిపోయాయి. జీవాల విలువ సుమారురూ.90వేలు ఉంటుందని బాధితులు రాములు, నగేశ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో జరిగిన ఘటన స్థలానికి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటినర్సయ్య వెళ్లి పరిశీలించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వీర్నపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రంలోని విద్యుత్‌వైరు తగిలి గర్జనపల్లి గ్రామంలో గురువారం మేక మృతిచెందింది. గ్రామానికి చెందిన అబ్బాస్ అనే కాపరి మేకమేస్తుండగా కొనుగోలు కేంద్రంలో లైట్లకోసం అమర్చిన విద్యుత్‌వైర్లు తేలి ఉండడంతో తీగలుతగిలి మేక అక్కడికక్కడే మృతిచెందింది. కాగామృతిచెందిన మేకవిలువ రూ.10వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.



రామగిరి మండలంలో మృతి చెందిన మేకలు

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం సాయంత్రం విద్యుత్‌షాక్‌తో పన్నూరు గ్రామానికి చెందిన మేకలు మృతి చెందాయి. పన్నూరు గ్రామానికి చెందిన కాపరి మేకలను మేతకోసం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోకి తీసికెళ్లాడు. వర్షం, గాలి వీయడంతో విద్యుత్ వైర్లు తెగి మేకలపై పడడంతో పన్నూరు గ్రామానికి చెందిన పరుషవేణ రాజయ్య, ఉడుత రాయమల్లు, తొట్లకొమురయ్య, పెరుమల్ల శంకర్‌లకు చెందిన ఐదు మేకలు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాయి. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ అధికారులను కోరారు.

మత్తడి దూకుతున్న చిన్నరాయుని కుంట

● వేసవిలో జలకళ.. రైతుల హర్షం..



మండుటెండలో మత్తడి దూకుతున్న చెన్నరాయుని కుంట

కోనరావుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో చిన్నరాయుని కుంట నీటితో కళకళలాడుతూ మత్తడి దూకడంతో పలుగ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ నుంచి 15 రోజుల క్రితం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేసవిలో సాగునీరు అందించేందుకు నీటిని కుడికాలువ ద్వారా విడుదల చేశారు. నాగారం, సుద్దాల, మారుపాక చెరువుల్లోకి నీరు చేరి కళకళలాడుతున్నాయి. సుద్దాల చిన్నరాయుడు కుంట పూర్తిగా నిండి మత్తడి దూకుతోంది. కాగా, నాగారం, మారుపాక చెరువులో నీరు నిండుకుండలా తలపిస్తున్నాయి. కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన మల్కపేట రిజర్వాయర్‌లోకి మధ్య మానేరు నుంచి సొరంగం ద్వారా నీటిని నింపి కుడి కాలువ ద్వారా నీటి విడుదల చేయగా పలు గ్రామాల చెరువులు నిండుతున్నాయి. దీంతో మండల ప్రజలు రెండు పంటల సాగుకు నీరు అందుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాజానికి మంచి చేయాలనే సంకల్పం ప్రతి ఒక్కరికీ ఉండాలి

● త్రిదండి చినజీయర్‌స్వామి



మాట్లాడుతున్న త్రిదండి చినజీయర్‌స్వామి

హుజూరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): సమాజానికి మంచి చేయాలనే సంకల్పం ప్రతి ఒక్కరి మనసులో ఉండాలని త్రిదండి చినజీయర్‌స్వామి అన్నారు. గురువారం రాత్రి హుజూరాబాద్ పట్టణంలోని సీతారామచంద్ర స్వామి ధ్వజస్తంభ, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాగశాలలో హోమం నిర్వహించి, ధ్వజస్తంభానికి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటివిద్య యాంత్రికంగా ఉంటుందని, అలాంటి విద్యవల్ల యంత్రాలాంటి మనుషులే తయారవుతున్నారన్నారు. నేటిబాలలే రేపటి భావిభారత పౌరులని, మంచి భావాలున్న బాలలను తయారుచేసే ఉత్కృష్ట కార్యక్రమాన్ని వికాసతరంగిణి చేపట్టిందన్నారు. సమాజానికి మంచిచేయాలనే సంకల్పంనేటి మనుషుల్లో పెంపొందించడానికి వికాస తరంగిణి కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, న్యాయమూర్తి సంధ్యారాణి, వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ,ఆలయచైర్మన్ క్యాసచక్రధర్,అర్చకులు, భక్తులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్‌లో 19మంది డీబార్

గణేశ్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ, రెండో సెమిస్టర్ పరీక్షల్లో గురువారం 19మంది విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడగా డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్‌కుమార్ తెలిపారు. కిమ్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో - 1, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గంభీరావుపేటలో-7, వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో -5, కేఎల్‌ఎన్ఎస్‌ఏ డిగ్రీ కళాశాల ధర్మపురిలో-3, శివాని డిగ్రీకళాశాల కరీంనగర్‌లో-3, మొత్తం 19మందివిద్యార్థులు డీబార్‌అయినట్లు తెలిపారు.

దారులన్నీ కాళేశ్వరం వైపే..

● ఎనిమిదో రోజు లక్ష మంది పుష్కర స్నానాలు

● బుధవారం రాత్రి కురిసిన వర్షంతో ఇబ్బందులు

● ట్రాఫిక్‌ను మళ్లించినా తప్పని తిప్పలు

● అడవిలో ఐదు కిలోమీటర్ల మేర జామ్



అన్నారం రోడ్డులో భారీగా నిలిచిన వాహనాలు

భూపాలపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నది పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. పుష్కరాలు ప్రారంభమై ఎనిమిది రోజులు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు బస్సులు, ప్రైవేటు వాహనాల్లో త్రిలింగ క్షేత్రానికి భారీగా తరలివచ్చారు. పుష్కరాలు మరో నాలుగు రోజుల్లో ముగియనుండడంతో భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పుష్కరాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం దాదాపు లక్ష మంది భక్తులు సరస్వతీ నదిలో పుష్కర స్నానాలు ఆచరించినట్లు అంచనా వేస్తున్నారు. ఒక్కసారిగా భక్తుల సంఖ్య పెరగడంతో పుష్కర ఘాట్లు జనంతో కిటకిటలాడాయి. ముక్తీశ్వరాలయంలోనూ స్వామివారి దర్శనం కోసం భక్తులకు నాలుగు గంటల సమయం పడుతోంది. బుధవారం రాత్రి కాళేశ్వరంలో కురిసిన భారీ వర్షం కారణంగా క్షేత్రమంతా నీరు నిలిచి బురదమయం కావడంతో పుష్కర ఘాట్లతోపాటు, తాత్కాలిక బస్టాండ్, పుష్కర ఘాట్లకు వెళ్లే మట్టి రోడ్లు బురదతో నిండిపోయి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పార్కింగ్ స్థలాల్లో వర్షం కారణంగా నీరు నిలిచి వాహనాలు కూరుకుపోవడంతో వాటిని బయటకు తీసి ట్రాఫిక్‌ని క్లియర్ చేసేందుకు అధికారులు తీవ్రంగా శ్రమించారు.

కాళేశ్వరం క్షేత్ర మంతా నల్లరేగడి మట్టితో కూడిన నేల కావడంతో వర్షానికి మొత్తం బురదగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దాంతో పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఏడు కిలోమీటర్ల దూరంలోని అన్నారం క్రాస్ నుంచి కాళేశ్వరానికి వాహనాలను మళ్లించారు. పార్కింగ్ స్థలాల్లో ఉన్న వాహనాలు కదలకపోవడంతో దాదాపు ఐదు కిలోమీటర్ల మేర అడవిలోనే ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనాలు చిక్కుకుపోయాయి. దాంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన క్రేన్లు, ట్రాక్టర్లను రంగంలోకి దింపి ట్రాఫిక్ జామ్‌కు కారణమైన వాహనాలను క్లియర్ చేసి రాకపోకలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేశారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో వైపు పుష్కర ఘాట్లకు సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్ సిటీ మొత్తం వర్షపు నీటితో బురద మయం కావడంతో అధికారులు వెట్ మిక్స్ చల్లి బురదను నియంత్రించే ప్రయత్నం చేశారు. వర్షం కారణంగా కూలిపోయిన టెంట్లను తిరిగి పున రుద్ధరించారు. చివరి మూడు రోజుల్లో భక్తులు మరింతగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. కలెక్టర్ రాహుల్‌శర్మ కాళేశ్వరంలో ద్విచక్ర వాహనం పై తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు.

పుణ్యస్నానాలు ఆచరించిన ప్రముఖులు

సరస్వతీ పుష్కరాల్లో ఎనిమిదో రోజు గురువారం నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యుడు సూర్యనారాయణ, ఆర్మూర్ శాసనసభ్యుడు పైడి రాకేష్‌రెడ్డి, వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యుడు గడుగు గంగాధర్, సినీ నటుడు అల్లు అర్జున్ తల్లి అల్లు నిర్మల తదితరులు స్నానాలు చేశారు.



స్నానాలాచరిస్తున్న భక్తులు



నదిలో దీపాలను వదులుతున్న మహిళలు



ఎడ్లబండ్లపై వెళుతున్న భక్తులు

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

● సైబర్ నేరగాళ్లకు మూడు వేల డాలర్లకు విక్రయం

● మానవ అక్రమ రవాణా కేసులో నిందితుడు హితేష్ అరెస్టు

● ఢిల్లీలో అదుపులోకి తీసుకుని మానకొండూర్ పీఎస్‌కు తరలింపు



హితేష్ అరెస్టు వివరాలు తెలుపుతున్న రూరల్ ఏఏస్పీ శుభం ప్రకాష్

కరీంనగర్ క్రైం/మానకొండూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు.. లక్షల్లో జీతం అంటూ ఇచ్చే ప్రకటలకు ఆకర్షితులైన యువతను మోసం చేశాడు గుజరాత్‌కు చెందిన హితేష్. పలు రాష్ట్రాల్లో ఏజెంట్లను నియమించుకుని వారి ద్వారా యువకులను ఆకర్షించాడు. వారి మాటలు నమ్మి అక్కడికి వెళ్లిన వారిని సైబర్ నేరాలు చేసే వారికి అమ్ముకున్నాడు. వీరి వలకు కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం రంగంపేట గ్రామానికి చెందిన కొక్కిరాల మధుకర్‌రెడ్డి చిక్కాడు. అతడిని మయన్మార్ పంపించి సైబర్ నేరాలు చేయించేవారు. ఆ పని చేయనంటే చిత్ర హింసలు పెట్టేవారు. మధుకర్‌రెడ్డి అక్కడి నుంచి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి తన గోడును వెళ్లబోసుకున్నాడు. ఆయన చొరవతో 540 మందికి విముక్తి లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు హితేష్‌ను పోలీసులు బుధవారం ఢిల్లీలో అరెస్టు చేసి మానకొండూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కరీంనగర్ రూరల్ ఏఏస్పీ శుభం ప్రకాష్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి..

విదేశాల్లో కంప్యూటర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి పలువురిని సైబర్ కేఫ్‌లకు విక్రయించిన కేసులో నిందితుడు గుజరాత్ రాష్ట్రం పోర్‌బందర్‌కు చెందిన హితేష్‌ను మానకొండూర్ పోలీసులు బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకుని మానకొండూర్‌కు తీసుకువచ్చారు. హితేష్‌కు తెలంగాణతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగులకు విదేశాల్లో కంప్యూటర్ ఉద్యోగాలిప్పిస్తానని, నెలకు లక్ష రూపాయల జీతం ఉంటుందని నమ్మబలికి సైబర్ నేరాలకు పాల్పడే వారికి మూడు వేల డాలర్లకు విక్రయించేవాడు. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన శ్యాంరావు హితేష్‌కు ఏజెంటుగా ఉంటూ గత ఏడాది డిసెంబరులో మానకొండూర్ మండలం రంగంపేట గ్రామానికి చెందిన కొక్కిరాల మధుకర్‌రెడ్డిని మయన్మార్‌లో కంప్యూటర్ ఉద్యోగమంటూ అక్కడికి పంపించారు. అక్కడి సైబర్ కేఫ్ నిర్వాహకులు మధుకర్‌రెడ్డి చేత బలవంతంగా సైబర్ నేరాలకు సంబంధించిన ఫోన్, వాట్సప్ కాల్స్ చేయించారు. ఈ పని ఇష్టం లేదంటూ మధుకర్‌రెడ్డి నిర్వాహకులతో గొడవకు దిగాడు. దీంతో వారు అతడిని చిత్రహింసలు పెట్టారు. ఈ విషయాన్ని మధుకర్‌రెడ్డి ఫోన్ ద్వారా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమారుకు తెలిపాడు. ఆయన హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకువెళ్లి మయన్మార్‌లోని సైబర్ కేఫ్‌లలో చిక్కుకుని వేధింపులకు గురవుతున్న 540 మందిని మయన్మార్ సైన్యం సహాయంతో విడిపించి భారత్‌కు తీసుకువచ్చారు. మధుకర్‌రెడ్డి ఫిర్యాదుతో మానకొండూర్ పోలీసు ఠాణాలో హితేష్‌పై మానవ అక్రమరవాణా కేసు నమోదైంది. ఈ కేసులో మానకొండూర్ పోలీసులు మార్చి నెలలో హితేష్‌పై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం మయన్మార్‌లో ఉంటున్న హితేష్‌ను అప్పగించాలని భారత విదేశాంగ శాఖ కోరిక మేరకు అతన్ని మంగళవారం మయన్మార్ అధికారులు ఇండియాకు డిపోర్ట్ చేశారు. బుధవారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన హితేష్‌ను ఇక్కడి ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుని విదేశాంగశాఖ అధికారులకు అప్పగించారు. హితేష్ ఇండియాకు వస్తున్నాడనే సమాచారంతో మానకొండూర్ పోలీసులు ఢిల్లీ విమానాశ్రయంలో వేచి ఉన్నారు. ముందుగా గుజరాత్ పోలీసులు హితేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జోక్యంతో హితేష్‌ను మానకొండూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. హితేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కరీంనగర్ రూరల్ ఏఏస్పీ శుభం ప్రకాష్ తెలిపారు.

వేములవాడలో భక్తుల రద్దీ

● హనుమాన్ జయంతితో పెరిగిన భక్తుల సంఖ్య



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాజన్న ఆలయానికి గురువారం భక్తుల రద్దీ మరింతగా పెరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చినట్లు అంచనా వేస్తున్నారు. భక్తులు ఆయాక్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని రాజన్నను దర్శించుకుని కోడెమొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతల ఆలయాల్లో కుంకుమపూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మ్యాన్‌హోల్‌లో పడిన యువకుడు

● రక్షించిన ఫైర్ స్టేషన్ సిబ్బంది



బాధితుడి వాహనాన్ని బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది, స్థానికులు


జగిత్యాల అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల మ్యాన్‌హోల్‌లో పట్టణానికి చెందిన ముకుందరెడ్డి అనే యువకుడు గురువారం రాత్రి తన ద్విచక్రవాహనంతోపాటు పడిపోయాడు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది ద్విచక్ర వాహనంతోపాటు యువకుడిని బయటకు తీశారు. ఎస్సారెస్పీ ఉపకాలువను పైపులతో మూసి అక్కడక్కడ మ్యాన్‌హోల్‌లు ఏర్పాటుచేశారు. గురువారం ఉదయం నుంచి పట్టణంలో భారీవర్షం కురుస్తుండగా నాలా ఉధృతంగా ప్రవహిస్తున్నది. అదృష్టవశాత్తు మ్యాన్ హోల్‌లో పడ్డ వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. అయితే నిత్యం వేలాది మంది తిరిగే ప్రాంతంలో ఉన్న మ్యాన్ హోల్‌పై ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా ఉండడం వల్ల ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు.

రూ.7450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7450 పలికింది. గురువారం మార్కెట్‌యార్డుకు ఇద్దరు రైతులు 18క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠధర రూ.7450, కనిష్ఠధర రూ.7400చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

సేంద్రియ ఎరువుల వైపు రైతుల చూపు

● భూసారం పెంపునకు ఆవు, కోడి ఎరువు వినియోగం ● అధిక దిగుబడుల కోసం అన్నదాతల యత్నం



చేనులో ఆవులను నిలుపుతున్న రైతులు

కథలాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : భూసారం పెంపునకు పలువురు రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారిస్తున్నారు. రసాయనిక ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతిని పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులను శాస్త్రవేత్తలు అప్రమత్తం చేస్తున్నారు. దీంతో పలువురు రైతులు ఆవుల మందను పొలాల్లో నిలుపుకుని ఆవు పేడ, మూత్రంతో భూసారాన్ని పెంచుకుంటున్నారు. సుమారు వంద ఆవులు ఉన్న మందను ఒక రోజు పొలంలో నిలిపితే సుమారు రూ.8 వేల ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. వానాకాలం, యాసంగి రెండు పంటలకు ఈ సేంద్రియ ఎరువు పనిచేస్తుందని రైతులు అంటున్నారు. కథలాపూర్ మండలంలో హైదరాబాద్ నుంచి కోడి ఎరువు లారీలను తెప్పిస్తున్నారు. లారీ ఎరువును రెండు ఎకరాలకు సరిపడేలా చల్లుకుంటున్నారు. ఇబ్బడి ముబ్బడిగా రసాయనిక ఎరువులను వినియోగించడం వల్ల ఎదురవుతున్న దుష్ప్రభావాలను రైతాంగం గుర్తిస్తోందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఆవుల మందలను కమ్మరిపల్లి మండలం మానాల నుంచి అక్కడి గిరిజనులు తెచ్చి రైతుల పొలాల్లో నిలుపుతున్నారు. నవంబర్ నుంచి మే దాకా దాదాపు ఆరు మాసాల పాటు ఆవులను పొలాల్లో నిలుపుతూ వారు ఉపాధి పొందుతున్నారు. మరికొందరు రైతులు చెరువుల్లోని మట్టిని పోసుకుని భూసారాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతోంది


ఏలేటి మారుతి, రైతు, భూషణ్‌రావుపేట



రసాయనిక ఎరువులను భారీగా వినియోగి స్తున్నందు వల్ల భూముల్లో ఉన్న పోషకాలు దెబ్బతింటున్నాయి. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు రైతులన చైతన్యవంతం చేస్తు న్నందు వల్ల చాలా మంది సేంద్రియ ఎరువుల వినియోగం వైపు మొగ్గు చూపుతున్నారు. భూ సారం పెంపునకు కోడి ఎరువు, ఆవు పేడ, చెరు వు మట్టి వినియోగిస్తున్నాం. సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటల దిగుబడులు పెరుగుతున్నాయి.

ఆవుల మందతో ఉపాధి

లావుడ్యు లక్ష్మి, మానాల



వానలు పూర్తిగా తగ్గిపోయిన తర్వాత సేంద్రియ ఎరువు అవసరమైన రైతులు ఆవులను తమ పొలాల్లో నిలుపుకుంటారు. పేడ, మూత్రం వల్ల భూముల్లో సారం పెరిగి అధికంగా దిగుబడులు వస్తాయి. రైతులు పోటీ పడి ఆవులను పొలాల్లో పెట్టుకుంటుండగా మాకు ఉపాధి లభిస్తోంది.

బదిలీపై వెళుతున్న ఏసీపీ, సీఐలకు వీడ్కోలు

కోల్‌సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషరేట్‌లో ఎస్బీ, ఏసీపీగా పనిచేసి హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌కు బదిలీఅయిన ఏసీపీ రాఘవేంద్ర రావు, కొమురంభీం ఆసిఫాబాద్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్‌లకు గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. సీపీ అంబర్ కిశోర్‌ఝా వీరికి శాలువాలు కప్పి మెమొంటోలు అందించారు. అంకితభావంతో విధులు నిర్వహించారని సీపీ అభినందించారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏసీపీ రాఘవేంద్రరావును సన్మానిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

సింగరేణి స్టాల్స్‌ను సందర్శించిన ప్రపంచ సుందరీమణులు



సింగరేణి సేవా సమితి స్టాల్‌ను సందర్శిస్తున్న ప్రపంచ సుందరీమణి పోటీదారులు

గోదావరిఖని, మే 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా మహిళా శక్తిబజార్‌ను గురువారం ప్రపంచ సుందరీమణులు సందర్శించారు. సింగరేణి సేవా సమితి స్వయం ఉత్పత్తిదారులను వస్త్ర విక్రయశాలను, బ్యాగులు, చేతి పర్సులు, మగ్గం వర్క్‌లతో చేసిన దుస్తులను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు చక్కగా ఉన్నాయంటూ ప్రశంసలు కురిపించారు. సింగరేణి సేవాసమితిద్వారా శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధిదిశగా ప్రోత్సహించిన సింగరేణియాజమాన్యానికి, సీఎండీ బలరాంనాయక్‌కు సేవా సమితి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌టీ సర్వీసుల మంజూరునకు సింగిల్ విండో వ్యవస్థ

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హెచ్‌టీ 11 కేవీ, 33కేవీ ఆపై వోల్టేజీ సర్వీసుల మంజూరు వేగవంతం చేయడానికి సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మేక రమేష్‌బాబు తెలిపారు. ఇందుకు హెచ్‌టీ మానిటర్ సెల్‌ను సర్కిల్ ఆఫీస్, కార్పొరేట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 11కేవీ వోల్టేజి దరఖాస్తు లను సర్కిల్ ఆఫీస్ ఏడీఈ కమర్షియల్ అధికారి మానిటర్ చేస్తారని తెలిపారు. 33కేవీ ఆపై వోల్టేజీ దరఖాస్తులను ఏడీఈ కమర్షియల్ కార్పొరేట్ ఆఫీస్ అధికారి మానిటర్ చేస్తారని తెలిపారు. మొదట వినియోగదారులు టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో ఎచ్‌టీ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 11 కేవీ వోల్టేజీ దరఖాస్తులు పరిశీలించి ఫీజిబులిటీ ఉంటే రెండు రోజుల్లో అప్‌లోడ్ చేయబడుతుందన్నారు. ఏవైనా కారణాలు ఉంటే రిమార్క్‌లు వినియోగదారునికి ఎస్ఎంఎస్ రూపేణా వస్తుంద న్నారు. 33కేవీ ఆపై దరఖాస్తులు పరిశీలించి సమయానుగుణంగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సింగిల్‌విండో వ్యవస్థతో త్వరితంగా సర్వీసులు మంజూరు అవుతాయని తెలిపారు. కార్యాలయానికి రాకుండా దరఖాస్తును ట్రాక్ చేసుకునే సౌకర్యం ఉంటుందని అన్నారు.

సీపీని కలిసిన ఏసీపీ మాధవి



సీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏసీపీ మాధవి

కరీంనగర్ క్రైం, మే 22(ఆంధ్రజ్యోతి): హుజురాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా నియామకమైన వి మాధవి గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఏసీపీ మాధవికి శుభాకాంక్షలు తెలియజేస్తూ హుజూరాబాద్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

డాక్యుమెంట్ల రద్దు నిలిపివేయాలని కలెక్టర్‌కు వినతి

సుభాష్‌నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): లోకాయుక్త ఆదేశాల మేరకు కొత్తపల్లి (హవేలి)లోని భూములకు సంబంధించిన డాక్యుమెంట్ల రద్దు నిలుపుదల చేయాలని బాధితులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్, ఆర్‌డీవోలకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లి(హ) ప్రస్తుత కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబరు 175, 197, 198లలో 476 ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసుకున్నామని తెలిపారు. అయితే ఈ సర్వే నంబర్లు సీలింగ్‌లో ఉన్న విషయం తెలియక కొనుగోలు చేసినట్లు చెప్పారు. అయితే అట్టి 476 ప్లాట్లను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఈనెల 12న ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ రద్దు అయితే తామంతా రోడ్డున పడతామని అన్నారు.

సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ ఉమెన్‌సెల్ కార్యాలయం ప్రారంభం

కరీంనగర్ క్రైం, మే 22(ఆంధ్రజ్యోతి): సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ ఉమెన్ సెల్ కార్యాలయం కరీంనగర్‌లో మహిళా రాణా సీఐ పి శ్రీలత గురువారం ప్రారంభోత్సవం చేశారు. సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ ఉమెన్‌సెల్ తెలంగాణ ఉపాధ్యక్షురాలు సరోజ ఆధ్వర్యంలో ఈ కార్యాలయం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సెల్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ కరీం,తెలంగాణ రాష్ట్ర చైర్మన్ షేక్ చాంద్ పాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయండి

కరీంనగర్ క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్, తీగలగుట్టపల్లి రైల్వే బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని, జమ్మికుంట రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు గురువారం విజ్ఞప్తి చేశారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

● కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ స్పోర్ట్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. నగరపాలక సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత వేసవి క్రీడా శిక్షణను గురువారం కమిషనర్ పరిశీలించారు. క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి క్యాంపులో క్రీడలను పరిశీలించారు. విద్యార్థులకు పాలు, గుడ్డు, అరటి పండ్ల పంపిణీ పరిశీలించారు. శిక్షణలో నేర్చుకున్న మెళకువల తీరుపై విద్యార్థులను ఆరా తీశారు. క్రికెట్‌తోపాటు పలు క్రీడలకు సంబంధించి ఆట పరికరాలను కోచ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ తరగతులు పకడ్బందీగా కొనసాగుతున్నాయని అన్నారు. ఎంపిక చేసిన 16 క్రీడల్లో చాలామంది విద్యార్థులు హాజరై కోచ్‌ల ద్వారా క్రీడల్లో శిక్షణ పొందుతున్నారని అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసిక, శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు క్రీడల్లో మెళకువలతో చక్కటి నైపుణ్యాన్ని విద్యార్థులు పొందడం జరుగుతుందని అన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతోపాటు క్రీడలు చాలా ముఖ్యమని అన్నారు. దాదాపు 2 వేలకుపైగా విద్యార్థులు సమ్మర్ క్యాంపునకు వచ్చి రెండు గంటలపాటు ఆసక్తిగా క్రీడల్లో మెలకువలు నేర్చుకుని నగరపాలక సంస్థ అందించే పౌష్టికాహారం పొందుతున్నారని తెలిపారు. సమ్మర్ క్యాంపును విజయవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ సతీష్, పలువురు కోచ్‌లు పాల్గొన్నారు.



క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

సైన్యానికి, మోదీకి మద్దతుగా ఏక్తా యాత్ర

(5వ పేజీ తరువాయి)



యాత్రలో కార్యకర్తలు, నగరవాసులు

దేశంలో అక్రమంగా నివాసం ఉంటున్న విదేశీయులను ఏరివేస్తుంటే మీరెందుకు సైలెంట్‌గా ఉన్నారని, వారికి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు అందించి సబ్సిడీలు ఇచ్చింది నిజం కాదా అన్నారు.

● ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

కరీంనగర్ అర్బన్: హిందూ ఏక్తాయాత్రలో హిందూ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ దేవతామూర్తుల బొమ్మలను వాహనాలపై ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రామ, లక్ష్మణ, హనుమాన్ వేషధారణలతో యాత్ర ముందు భాగంలో కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. రాజీవ్‌చౌక్‌లో హిందూ ఏక్తాయాత్రలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ముస్లింలు గజమాలతో సన్మానించి, స్వాగతం పలుకుతూ గులాబీలను యాత్రలో పాల్గొన్న భక్తులపై చల్లారు. యాత్ర పొడవునా పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు భక్తులకు మజ్జిగ, తాగునీరు అందించారు.

● పటిష్ట బందోబస్తు

కరీంనగర్ క్రైం: హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో గురువారం నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రకు పోలీసుశాఖ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఏక్తాయాత్ర సాగే మార్గంలో పెద్ద సంఖ్యలో సాయుధ, మఫ్టీలో పోలీసులను మోహరించారు. మద్యం దుకాణాలను మూసివేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో బందోబస్తును పర్యవేక్షించారు. సున్నితమైన ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. హిందూ ఏక్తాయాత్ర ర్యాలీకి బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం సీపీ బ్రీఫింగ్ చేశారు. సున్నితమై ప్రాంతాల్లో స్టాటిక్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ రూఫ్‌టాప్ నిఘా, మొబైల్ పెట్రోలింగ్‌లను ఏర్పాటు చేశారు. హిందూ ఏక్తాయాత్ర బందో బస్తును గురువారం రాత్రి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కమాండ్ కంట్రోల్ బస్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ ద్వారా పర్యవేక్షించారు.

ఘనంగా హనుమాన్ జయంతి



మంకమ్మతోట భక్తాంజనేయస్వామి దేవాలయంలో..



ఇల్లందకుంటలో మాల విరమణ చేస్తున్న భక్తులు

కరీంనగర్ కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా ఆలయాల్లో గురువారం పెద్ద హనుమజ్జయంతి పూజలను ఘనంగా నిర్వహించారు. హనుమదాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పారాయణాలు, హవనాలు, పూజలు, అభిషేకాలు, నాగవల్లీ దళార్చనల్లో పాల్గొని ఉపవాసాలతో, ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. భజనలు, కీర్తనలు ఆలపిస్తూ భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. పలు చోట్ల అన్నదానాలు జరిగాయి. ఆయా ఆలయాల కమిటీ బాధ్యులు, అధికారులు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. పాతబజార్ ప్రాచీన చిన్న హనుమాన్ దేవాలయంలో పురోహితుడు మంగళంపల్లి శ్రీనివాసశర్మ, అర్చకులు వానమామలై శ్రీధరాచార్యులు, కౌశికాచార్యులు పూజలు చేశారు. భగత్‌నగర్, అంజనాద్రిపై చిలకపాటి హనుమంతారావు పాల్గొన్నారు. మంకమ్మతోట భక్తాంజనేయస్వామి దేవాలయంలో ఈఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి దేవాలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకొని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి భక్తులు బుధవారం రాత్రి నుంచి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. సుమారు 2800మంది స్వాములు దీక్ష విరమణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో సుధాకర్ ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రి హనుమాన్ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు అండర్-9 విభాగంలో ఈ నెల 11న గోదావరిఖనిలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగ పోటీల్లో విశేష ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అకాడమీ డైరెక్టర్, కోచ్ కంకటి అనూప్‌కుమార్ తెలిపారు. బాలుర విభాగంలో ఉమాంగ్ సోనీ, దేవేంద్రసింగ్, శ్రీవాస్తవ్, బాలికల విభాగంలో శ్రీ హంసిని, తన్వి ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం క్రీడాకారులను నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మెమోంటోలను అందించి అభినందించారు. కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనుకయ్య, కో-ఆర్డినేటర్ సృజన్, డైరెక్టర్ అనూప్ కుమార్, అకాడమీ బాధ్యులు అభిరామ్, రేవిక్, అరుణ్, నితిన్, ప్రభుచంద్ర, శ్రీనిజ, స్వాతి పాల్గొన్నారు.

గురుకులాల ఎత్తివేత సరికాదు

గణేశ్‌నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యం లోని 12 ఇంటర్ గురుకులాలు ఎత్తి వేయాలనే నిర్ణయం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ పేర్కొన్నారు. జిల్లాలోని చొప్పదండి ఎస్సీ బాలికల గురుకులం ఈ జాబితాలో ఉందన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

● గురుకుల కళాశాలలను మూసివేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి తిపారపు సురేష్ డిమాండ్ చేశారు.

● సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల మూసివేత నిర్ణయం సరికాదని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు జక్కనపల్లి గణేష్ అన్నారు. అలుగునూర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) గురుకుల విద్యాసంస్థ నుంచి బాలుర హాస్టల్ తరలింపును నిలిపివేయాలని కోరారు.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

గణేశ్‌నగర్, మే22(ఆంధ్రజ్యోతి): నేడు నగరంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, టౌన్ టు ఏడీఈ, ఎం.లావణ్య తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు శ్రీరాంనగర్, రోడ్ నేంబర్ 5,6,7, ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు పద్మనగర్ ఏరియా,ఉదయం 9:30 గంటల నుంచి 10:30 వరకు పద్మనగర్ ఏరియా, పారమిత స్కూల్ ఏరియా, మానేర్ స్కూల్ ఏరియా,మార్క్‌ఫెడ్ ఏరియా, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

భాగ్యరెడ్డి వర్మ విగ్రహం ఏర్పాటుకు కృషి

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే జయంతిలోగా సుడా నిధులతో భాగ్యరెడ్డి వర్మ విగ్రహం ఏర్పాటు చేస్తామని సుడా చైర్మెన్, భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవ కమిటీ, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. గురు వారం భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ భాగ్యరెడ్డి వర్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ దళితుల అభ్యున్నతికి, దళిత మహిళల విద్య, అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. 1906 నుంచి 1933 వరకు హైదరాబాద్ సంస్థానంలో దళిత బాలబాలికల కోసం 26 పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి పునాదులు వేశారని అన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్‌డీవో మహేశ్వర్, ఎస్సీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్, భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవ కమిటీ సభాధ్యక్షుడు కాడే శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బొగ్గుల మల్లేశం, సభ్యుడు మేడి అంజయ్య, మేడి మహేశ్, దండి రవీందర్, దామెర సత్యం, జుంజుపల్ల వివేక్, సొడమల్ల సన్ని ఎడ్వర్డ్, దార స్వరూప, వెన్నం రాజమల్లయ్య, గంటల రేణుక ఉన్నారు.



భాగ్యరెడ్డి వర్మకు నివాళులర్పిస్తున్న సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, దళిత సంఘాల నాయకులు

జమ్మికుంట : జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఈలు నరేష్, వికాస్, ఆర్ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, టీపీబీవో దీపిక, ఎస్ఐ మహేష్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల విడుదలలో క్లారిటీ లేదు

గంగాధర, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన పెండింగ్ బిల్లుల విడుదలలో ఎలాంటి స్పష్టతలేదని రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్‌కమిటీ కార్యవర్గ సభ్యుడు శ్రీమల్ల మేఘరాజు అన్నారు. గురువారం ఆయన గంగాధరలో మాట్లాడారు. 12,769 సర్పంచ్‌లకు సంబంధించిన పెండింగ్‌బిల్స్ ఎంతశాతం విడుదలచేశారు, ఇంకా ఎన్ని గ్రామాలవి పెండింగ్ ఉన్నవి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్‌డిఎఫ్, సీడీఎఫ్, ఎస్ఎఫ్‌సీ స్టేట్ ఫైనాన్స్ బిల్లులు ఎన్ని ఇచ్చారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, మిగతావి ఎప్పుడు విడుదలచేస్తారని ప్రశ్నించారు. ఇలాఅస్పష్ట ప్రకటనలతో అరకొర నిధుల ఇచ్చితప్పుడు సంకేతాలు ఇవ్వడం సబబు కాదన్నారు. రాష్ట్ర సర్పంచుల సంఘాలు ఏడాదిన్నరగా ఎన్నోపోరాటాలు చేసి ఎందరో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నా పెండింగ్‌బిల్లులు చెల్లించకుండా సతాయించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు ఒకేమారు చెల్లించి సర్పంచ్ వ్యవస్థను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రామకృష్ణ కాలనీలో వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిమ్మాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీలో గ్రామ పంచాయతీలో కరీంనగర్‌లోని ఆదర్శ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 200మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు మానస, తేజస్విని, హృదయ్ మాట్లాడుతూ అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తామన్నారు. వారి పరిస్థితిని మెరుగుపరిచే వరకు తాము అబ్జర్వేషన్‌లో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో గ్రామ మాజీఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఆసుపత్రి ఎండీ, సీఈవో కరివేద సత్యనారాయణరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గంగాధర, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిక్యాల శివారులో విద్యుత్‌శాఖ అధికారులు వ్యవసాయపంపు సెట్లకు అదనపువోల్టేజీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి సమస్యను పరిష్కరించారు. గురువారం 'వానాకాలం సాగుకు ముందే కరెంటు కష్టాలు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏడీ సత్యనారాయణ తక్షణం మండలస్థాయి అధికారులను అప్రమత్తంచేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. ఒక్క రోజులోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి రైతుల సమస్యలు తీర్చిన విద్యుత్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు విద్యుత్ సమస్యలు తమ దృష్టి తీసుకువస్తే ఎలాంటి పైరవీలు లేకుండా ఒక్క రోజులోనే పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.

సంక్షేమ పథకాలను అమలు చేయడమే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమపథకాలు అమలు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతనిర్మాణ సన్నాహకసమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని అన్నారు. మళ్లీకాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ అభివృద్ధికి పనిచేసిన ప్రతి కార్యకర్తకు సరైనా గుర్తింపు ఉంటుందన్నారు. హుస్నాబాద్ వ్యవసాయశాఖ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీసీసీ పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, నమిళ్ల శ్రీనివాస్, చిట్టుమల్లరవీందర్, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, మాజీజడ్పీటీసీ గీకురు రవీందర్, పోలుస్వప్న, సింగిల్ విండో మాజీచైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి పూజలు..

చిగురుమామిడి శివారులోగల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను అర్చకులు ఘనంగా సన్మానించారు.

హుజూరాబాద్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన మాధవి



బాధ్యతలు స్వీకరిస్తున్న మాధవి

హుజూరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏసీపీగా వాసంశెట్టి మాధవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏసీపీ శ్రీనివాస్‌జీని హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీచేయగా, ఆయన స్థానంలో మాధవిని నియమించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు ఆమెకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.

జమ్మికుంట రూరల్: హుజూరాబాద్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన మాధవిని జమ్మికుంట మాజీమున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ దేశీనికోటి గురువారం పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

శంకరపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్, మెట్‌పల్లి, గద్దపాక సహకార సంఘాల పరిధిలో వరిధాన్యం కొనుగోళ్లు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటివరకు మెట్‌పల్లి, తాడికల్, గద్దపాక సొసైటీల పరిధిలో సన్నరకం ధాన్యం, దొడ్డు రకం కలిపి మొత్తం 91,022 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు.

ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

శంకరపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త కొరిమి వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం శంకరపట్నం మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలుజరిపి కాల్పుల విరమణ పాటించాలన్నారు. ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేసి బలగాలను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం..

ఇల్లందకుంట: ఆపరేషన్ కగార్‌పేరుతో మావోయిస్టులను కాల్చిచంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎం) మండలకార్యదర్శి చెల్పూరి రాము అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు పార్టీఅగ్రనేత నంబాల కేశవరావుతోపాటు 27మంది మావోయిస్టులను కేంద్రబలగాలు కాల్చి చంపడం సమంజసం కాదన్నారు. కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా మావోయిస్టులచర్చల ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి శాంతియుత వాతావరణానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

మొక్కలు సక్రమంగా పెరిగేలా బాధ్యత తీసుకోవాలి

హుజూరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): మొక్కలు సక్రమంగా పెరిగేలా మహిళలు పూర్తిబాధ్యత తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. గురువారం హుజూరాబాద్ పరిధిలోని కేసీ క్యాంపు, ఇపుల్‌నర్సింగాపూర్, దమ్మక్కపేట గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని మహిళాసంఘాల సభ్యులందరూ వర్షాకాలంలో మొక్కలను నాటి, జియోట్యాగ్ ద్వారా వాటిని తప్పనిసరిగా రెండేళ్లపాటు సంరక్షించాలన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నారాయణరెడ్డి

హుజూరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నల్ల నారాయణరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

ఈ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న రాజేందర్‌రెడ్డిని వైద్యఆరోగ్యశాఖకు సరెండర్‌చేయగా, ఆర్ఎంవోగా ఉన్న సుధాకర్‌రావును సస్పెండ్‌చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వాస్పత్రులకు వచ్చేరోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారని ఆరోపణలకు ఫిబ్రవరిలో జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి విచారణజరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు.

ఈ క్రమంలో ఆస్పత్రిలో పనిచేసే 14మంది ప్రైవేట్‌సిబ్బందిని సస్పెండ్‌చేసి చేతులుదులుపుకోగా, జిల్లాకలెక్టర్ ఇచ్చిన నివేదికతో ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు శుక్రవారం నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.

సిరిసేడులో నిధుల గోల్‌మాల్

ఇల్లందకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామ పంచాయతీలో నిధులగోల్‌మాల్ జరిగిందని ఆర్టీఐ కార్యకర్త జవాజి అనిల్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి అంకూస్, గ్రామస్పెషలాఫీసర్‌గా ఉన్న అప్పటి ఎంపీవో వెంకటేశ్వర్లు కుమ్మక్కై జీపీనిధులను దుర్వినియోగం చేశారన్నారు. పంచాయతీ కార్యదర్శి కుమారుడి పేరుతో చెక్కు జారీచేసి, రూ.1.89లక్షలు డ్రాచేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. నిధుల గోల్‌మాల్‌పై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి రికవరీచేసి, బాధ్యులపై చట్టపరమైనచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మోస్తరు వర్షం

శంకరపట్నం/జమ్మికుంట రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మోస్తరు వర్షం కురిసింది. శంకరపట్నం బస్టాండ్ సమీపంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై వర్షపునీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులకు గురయ్యారు. నిన్న, మొన్నటి వరకు ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ప్రస్తుతం ఏర్పడిన చల్లటి వాతావరణంతో కాస్త ఉపశమనం లభించింది.

తహసీల్దార్‌కు ఘన సన్మానం

జమ్మికుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నల్ల వెంకటరెడ్డిని తాజామాజీ మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ దేశిని కోటి గురువారం ఘనంగా సన్మానించారు. అంతకు ముందు కార్యాలయం సిబ్బంది తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో తాజామాజీ కౌన్సిలర్లు, రెవెన్యూఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ఏక్తాయాత్రకు భారీగా తరలివెళ్లిన నాయకులు

శంకరపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని పురస్కరించుకొని కరీంనగర్‌లో జరిగే హిందూ ఏక్తాయాత్రకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి హిందువులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ మాట్లాడుతూ ఈయాత్ర హిందువుల ఐక్యతను, హిందువులను సంఘటితం చేసేందుకు పాటుపడుతుందని తెలిపారు.